సంపుటి :02 సంచిక :209 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

మంగళవారం 14, అక్టోబర్ 2025

## మావోయిస్టు డంప్ స్వాధీనం

ఐదు ఐఈడీ బాంబులు నిర్వీర్యం

మావోయిస్టు పార్టీకు భారీ షాక్

భద్రతా దళాలను హతమార్చే వ్యూహం భగ్నం




5లో..



## ఐ క్లౌడ్ పాస్వర్డ్ రీసెట్ చేయండి!

- అత్యుత్తమ న్యాయస్థానం
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు
- నిందితుడు ప్రభాకర్‌రావు మధ్యంతర బెయిల్ పొడిగింపు
- వచ్చే నెల 18కి విచారణ వాయిదా

2లో..



3లో

## సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, అత్యంత కీలకమైన పొలిట్‌బ్యూరో సభ్యుడు అయిన మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను అలియాస్ అభయ్ మంగళవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోవడం సంచలనం సృష్టించింది. 60 మందికి పైగా సహచరులతో కలిసి ఆయన ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిశారు. గత కొంతకాలంగా మావోయిస్టు ఉద్యమంపై, దాని ప్రస్తుత పంథాపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన తీసుకున్న ఈ నిర్ణయం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ కగార్' వంటి చర్యలకు గొప్ప విజయాన్ని చేకూర్చినట్లయింది. ఆయన లొంగుబాటుతో సుదీర్ఘంగా సాగుతున్న సాయుధ విప్లవోద్యమానికి భారీ దెబ్బ తగిలిందని అధికారిక వర్గాలు ధృవీకరించాయి. ఈ మేరకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ సమక్షంలో మీడియా ముందుకు రానున్నారు.

— అక్షరదర్బార్, గడ్చిరోలి/ హైదరాబాద్

# లొంగిపోయిన మల్లోజుల

2లో..

మల్లోజుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న మావోయిస్టు పార్టీ

- మహారాష్ట్రలో 60 మంది సహచరులతో లొంగుబాటు
- సీఎం ఫడ్నవీస్ సమక్షంలో మీడియా ముందుకు..
- నాలుగు దశాబ్దాల ఉద్యమానికి ముగింపు
- మావోయిస్టు ఉద్యమానికి కోలుకోలేని దెబ్బ

## ప్రస్తుత డీసీసీలకు రెండోసారి నో

పార్టీలో గ్యాప్ లేకుండా ఐదేళ్లు పనిచేస్తున్న వారే అర్హులు

- బంధువులు, సన్నిహితుల కోసం పైరవీలు వద్దు..
- ఏఐసీసీ పరిశీలకులతో వ్యక్తిగత సంభాషణ వద్దు..
- కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్



5లో..



5లో..

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవో- 9పై హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను మంగళవారం కోర్టు రిజిస్ట్రార్ దగ్గర ప్రభుత్వ న్యాయవాదులు మెన్షన్ చేశారు. గురువారం లేదా శుక్రవారం విచారించాలని విజ్ఞప్తి చేశారు. సీజేఐ అనుమతితో లిస్ట్ చేయనున్నట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు. రిజర్వేషన్లపై 50% పరిమితి విధిస్తున్నట్లు రాజ్యాంగంలో ఎక్కడా నిబంధనలు లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోపై స్టే విధించడాన్ని తప్పుబడుతూ రాష్ట్ర సర్కారు ఈ పిటిషన్ దాఖలు చేసింది.– న్యూఢిల్లీ, అక్షర దర్బార్

## సుప్రీం కోర్టులో ఎస్ఎల్పీ

'బీసీ కోటా'పై స్టే నిలువరించాలని రాష్ట్ర ప్రభుత్వం దాఖలు

- హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ అత్యున్నత న్యాయస్థానానికి..
- ఎల్లుండి లేదా ఆ తర్వాతి రోజు విచారణకు వచ్చే అవకాశం




## పోషణ మాసం

అక్షర దర్బార్, పరకాల : జాతీయ పోషణ మాసం సందర్భంగా పరకాల ప్రాజెక్ట్ నాగారం సెక్టార్, కామారెడ్డిపల్లి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రాణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, గర్భిణీలకు పోషణ శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాశనం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షీలా, అంగన్వాడీ టీచర్లు రజిత, సుచరిత, మమత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


www.aksharadarbar.com
అక్షర దర్బార్
Voice of the people

# లొంగిపోయిన మల్లోజుల



- మహారాష్ట్ర ఎదుట 60 మంది సహచరులతో లొంగుబాటు
- సీఎం ఫడ్నవీస్ సమక్షంలో మీడియా ముందుకు..
- నాలుగు దశాబ్దాల మావోయిస్టు ఉద్యమానికి ముగింపు
- మావోయిస్టు ఉద్యమానికి కోలుకోలేని దెబ్బ
- మల్లోజుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న మావోయిస్టు పార్టీ

అక్షరదర్బార్,గడ్చిరోలి/ హైదరాబాద్ : మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, అత్యంత కీలకమైన పొలిట్‌బ్యూరో సభ్యుడు అయిన మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను అలియాస్ అభయ్ మంగళవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోవడం సంచలనం సృష్టించింది. 60 మందికి పైగా సహచరులతో కలిసి ఆయన ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిశారు. గత కొంతకాలంగా మావోయిస్టు ఉద్యమంపై, దాని ప్రస్తుత పంథాపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన తీసుకున్న ఈ నిర్ణయం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ కగార్' వంటి చర్యలకు గొప్ప విజయాన్ని చేకూర్చినట్లయింది. ఆయన లొంగుబాటుతో సుదీర్ఘంగా సాగుతున్న సాయుధ విప్లవోద్యమానికి భారీ దెబ్బ తగిలిందని అధికారిక వర్గాలు ధృవీకరించాయి. ఈ మేరకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ సమక్షంలో మీడియా ముందుకు రానున్నారు.

### మల్లోజుల ప్రస్థానం..

తెలంగాణలోని పెద్దపల్లికి చెందిన వేణుగోపాల్ రావు బీకాం చదివాడు. ఆయన అన్న మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీతో కలిసి నాలుగు దశాబ్దాల క్రితం తుపాకీ పట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నాడు జరిగిన జగిత్యాల జైత్రయాత్రలో చురుకైన పాత్ర పోషించిన ఈ అన్నదమ్ములు, అప్పటినుంచి పీడిత ప్రజల పక్షాన అడవుల్లో పోరాటం సాగించారు. కేంద్ర కమిటీలో సుమారు 28 ఏళ్లు, పొలిట్‌బ్యూరోలో 18 ఏళ్లు కీలక బాధ్యతలు నిర్వహించారు. 2011లో కిషన్‌జీ ఎన్‌కౌంటర్‌లో మరణించిన తర్వాత కూడా వేణుగోపాల్ రావు పార్టీ పంథాను వీడకుండా కొనసాగారు. అయితే, ఆయన తల్లి మధురమ్మ తన కొడుకుల కోసం ఎదురుచూసి రెండేళ్ల క్రితం మరణించడం, సుదీర్ఘ పోరాటంలో జరిగిన బలిదానాలు ఆయనపై తీవ్ర ప్రభావం చూపాయని తెలుస్తోంది.

### ఉద్యమం ఎదుగుదల.. ఎదురుదెబ్బలు

మావోయిస్టు పార్టీ ఎదుగుదలను గమనిస్తే.. 1998 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బలహీనపడటం ప్రారంభమైంది. పరిస్థితిని గమనించిన పార్టీ 2003లో ఉత్తర తెలంగాణ నుంచి బలగాలను దండకారణ్యానికి తరలించింది. అయినప్పటికీ, 2005 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ పూర్తిగా దెబ్బతిన్నది. దీనికి ప్రధాన కారణం, తమ బలాన్ని ఎక్కువగా, ప్రత్యర్థి బలాన్ని తక్కువగా అంచనా వేయడం వంటి తప్పుడు నిర్ణయాలేనని వేణుగోపాల్ తన సుదీర్ఘ లేఖలో పేర్కొన్నారు. వరుస ఎన్‌కౌంటర్లలో వందలాది మంది కేడర్‌ను కోల్పోతున్న పార్టీ ప్రస్తుత కష్టకాలంలో పిడివాద, అతివాద విధానాలను కొనసాగించడం సరైంది కాదనే భావన ఆయన లొంగుబాటుకు ప్రధాన కారణంగా నిలిచింది.

### లొంగుబాటుకు దారితీసిన కీలక అంశాలు

మల్లోజుల లొంగుబాటుకు ముందు, పార్టీ విధానాలపై తన అసంతృప్తిని తెలియజేస్తూ ఒక లేఖను విడుదల చేశారు. ఆ లేఖలో, ఉద్యమం ఓడిపోకుండా కాపాడలేకపోయినందుకు పొలిట్‌బ్యూరో సభ్యుడిగా క్షమాపణలు కోరారు. విప్లవోద్యమ బాధ్యతల్లో తాను ఎంతమాత్రం కొనసాగడానికి అర్హుడిని కానని ఆయన తీవ్ర మనస్తాపంతో పేర్కొన్నారు. అనేక బలిదానాలకు దారితీసిన పార్టీ విధానాల్లోని లోపాలను ఆయన ప్రస్తావించారు. ఆదివాసీ రైతులకు ప్రభుత్వాలు ఇచ్చే భూమి పట్టాలను వ్యతిరేకించడం, జనతన సర్కారు ఇచ్చే పట్టాలకు, ఆ బడుల్లో చదువులకు విలువ లేకపోవడం, ప్రజలు ఆధార్ కార్డులు తెచ్చుకోవడాన్ని కూడా వ్యతిరేకించడం వంటి తప్పుడు నిర్ణయాలు పార్టీని ప్రజల నుంచి దూరం చేశాయని ఆయన విమర్శించారు. ఈ తప్పులను సరిదిద్దుకోవాలంటే ఆయుధాలు వదిలేసి, శాంతి చర్చలకు వెళ్లడం, ప్రజల్లోకి బహిరంగంగా వెళ్లడం తప్ప వేరే మార్గం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

### శాంతి చర్చల కోసం పిలుపు.. పార్టీ నుంచి వ్యతిరేకత

మల్లోజుల వేణుగోపాల్ గత నెల సెప్టెంబర్‌లో ఆయుధాలు వదిలి శాంతి చర్చలకు వెళ్లాలని పార్టీ నుంచి ప్రకటన విడుదల చేశారు. తాము శాంతి చర్చలకు సిద్ధమన్నట్లు ప్రకటన జారీ చేశారు. దీనిపై పార్టీలోని కొందరు అగ్రనేతలు, ముఖ్యంగా హిడ్మా, దేవ్‌జీ వంటివారు తీవ్రంగా స్పందించారు. మల్లోజులను తీవ్రంగా వ్యతిరేకించారు. దీనికి బదులుగా వేణుగోపాల్ 22 పేజీల సుదీర్ఘ లేఖను విడుదల చేశారు. ఈ లేఖల యుద్ధం జరుగుతున్న సమయంలోనే ఆయన లొంగిపోవడం గమనార్హం. ఆయన ప్రకటనకు ఛత్తీస్‌గఢ్‌తో సహా ఇతర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని కొంత కేడర్ మద్దతు ప్రకటించింది. వందల మందిని కోల్పోతున్న పరిస్థితుల్లో, మిగిలిన వారినైనా కాపాడుకోవాలంటే, అనవసర త్యాగాలకు అంతం పలికి, నూతన పద్ధతుల్లో పురోగమించాలని ఆయన తోటి మావోయిస్టు నేతలకు విజ్ఞప్తి చేశారు. పార్టీ ఈ లేఖను ఖండించినప్పటికీ, ఆయుధాలు వదిలేయాలని ఆదేశించిన కొద్ది రోజులకే మల్లోజుల పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. ఈ పరిణామం మావోయిస్టు పార్టీకి, ముఖ్యంగా అగ్ర నాయకత్వానికి, బలమైన సందేశాన్ని ఇచ్చినట్లయింది.

## ఘనంగా ధర్మచక్ర పరివర్తన దినోత్సవం

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బౌద్ధమతం స్వీకరణ దినోత్సవం సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పర్లపెల్లి గ్రామంలో ఘనంగా వేడుకలు జరిగాయి. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం, పుష్పాలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల ఉపాధ్యక్షుడు మనోజ్, రత్న భాస్కర్, ఆకుతోట రమేష్, పొన్నం రమేష్, పుల్యాల భగత్ తదితరులు పాల్గొన్నారు.



## ఐ క్లౌడ్ పాస్వర్డ్ రీసెట్ చేయండి !

- అత్యున్నత న్యాయస్థానం
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు
- నిందితుడు ప్రభాకర్ రావు మధ్యంతర బెయిల్ పొడిగింపు
- వచ్చే నెల 18కి విచారణ వాయిదా



న్యూఢిల్లీ, అక్షర దర్బార్: తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపు తీసుకున్నది. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు ఐ క్లౌడ్ పాస్వర్డ్ రీసెట్ చేయాలని సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశించింది. అలాగే ఆయన మధ్యంతర బెయిల్ ను న్యాయస్థానం పొడిగించింది. తదుపరి వి చారణను వచ్చే 18కి వాయిదా వేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసుపై తాజాగా సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. రాష్ట్రప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినించారు. మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు కేసు దర్యాప్తునకు సహకరించడం లేదని.. ఆయన్ను కస్టోడియల్ ఇంటరాగేషన్ కు అప్పగించాలని కోర్టుకు తెలిపారు. డిజిటల్ డివైసెస్లో డాటా ఫార్మా చేశారని.. ఐ ఫోన్, ఐ క్లౌడ్ పాస్వర్డ్ ఇవ్వడం లేదని కోర్టు దృష్టికి తీ సుకొచ్చారు. ప్రభుత్వం మారగానే హార్డ్ డిస్క్ లో డేటా ధ్వంసం చేసినట్లు తెలియజేశారు. అలాగే... ప్రభాకర్ రావు తరపున న్యాయవాది శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. ప్రభాకర్ రావు డివైస్ రీసెట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని.. ఆయనను 11సార్లు పిలిపించి 80 గంటల పాటు విచారణ జరి పినట్లు తెలిపారు. డేటాను ప్రభాకర్ డిలీట్ చేయలేదని డిపార్ట్మెంట్ డిలీట్ చేసిందని చెప్పారు. ఇరువురి వాదనలు విన్న ధర్మాసనం పై విధంగా స్పందించింది. తదుపరి విచారణను వచ్చే నెల 18కు వాయిదా వేసింది.



## జిల్లా అధ్యక్ష పదవి రేసులో కోటగిరి సతీష్ గౌడ్

అక్షర దర్బార్,టేకుమట్ల: కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కష్టకాలంలోనూ కదిలిన యువ నాయకుడు. భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి కోసం అభిప్రాయ సేకరణ జరుగుతున్న నేపథ్యంలో టేకుమట్ల మండలానికి చెందిన ఏంపేడు గ్రామ యువజన నాయకుడు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ ప్రధాన దావేదారుగా నిలుస్తున్నారు. గత పదిహేనేళ్లుగా కాంగ్రెస్ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసి, పార్టీ కష్టసమయాల్లోనూ వెనుకడుగు వేయని నాయకుడిగా జిల్లాలో సతీష్ గౌడ్ పేరు ప్రాచుర్యం పొందింది. ఆయన, పార్టీ బలోపేతమే తన శ్వాసగా, కార్యకర్తల రక్షణనే తన బాధ్యతగా తీసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎదుర్కొన్న కష్టకాలంలోనూ సతీష్ గౌడ్ ధైర్యంగా ముందుకు వచ్చి కార్యకర్తలకు అండగా నిలిచారు. కేసులు, హింస, అవమానాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఆయన వెనక్కి తగ్గలేదు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తు సమర్పించిన సందర్భంగా సతీష్ గౌడ్ మాట్లాడుతూ, "కష్టకాలంలోనూ పార్టీకి అండగా నిలిచిన నాకు అవకాశం కల్పిస్తే, కాంగ్రెస్ పార్టీని మరింత బలపరచి, నూతన నాయకత్వాన్ని తీర్చిదిద్దుతానని. సమాజంలోని అన్ని వర్గాలకూ న్యాయం జరిగేలా పార్టీని ప్రజల మధ్య నిలబెట్టడం నా ధ్యేయం" అని పేర్కొన్నారు.

# ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

## స్తంభాలపై పెరిగిన పిచ్చి మొక్కలు

నల్లబెల్లి, అక్షర దర్బార్: నల్లబెల్లి మండలంలోని ఎస్సీ వాడ ప్రధాన రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను సరైన రీతిలో నిర్వహించకపోవడం వల్ల స్థానికులలో ఆందోళన పెరిగింది. స్తంభాలపై రాజకీయ పార్టీ జెండాలు, ఇనుప ఫ్లెక్సీ బోర్డులు, కేబుల్ వైర్లు వేలాడుతూ ప్రమాదకర పరిస్థితిని సృష్టిస్తున్నాయి. గ్రామంలో కొన్ని స్తంభాలను పిచ్చిమొక్కలతో కప్పేసి ఉండటం, కరెంట్ తీగలతో కలిసిపోవడం ప్రమాదానికి కారణ మయ్యే అవకాశం ఉందని ప్రజలు పేర్కొన్నారు. వర్షాకాలంలో వీటికి షార్ట్ సర్క్యూట్, కరెంట్ లీక్ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువ అని వారు హెచ్చరించారు. చిన్నపిల్లలు, జంతువులు వీటిని దాటేటప్పుడు ప్రాణహానీ సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు విద్యుత్ శాఖ అధికారులను విజ్ఞప్తి చేస్తూ, స్తంభాల చుట్టూ పెరిగిన మొక్కలు, ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ ముళ్ళ పొదలను తొలగించి,



భద్రతా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. స్థానికులు, "ప్రజల భద్రత ప్రభుత్వ ప్రధాన బాధ్యత, చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదానికి దారి తీస్తుంది. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి" అని అన్నారు.

# ఐకేపీ కేంద్రాల్లో అక్రమాలపై ఇద్దరి అరెస్టు, రిమాండ్

అక్షర దర్బార్ శాయంపేట: 2024–25 రబీ పంట సీజన్ సమయంలో ఐకెపి సెంటర్‌లలో జరిగిన అక్రమాల కేసులో శాయంపేట పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన కేసు Cr. No. 196/2025 నేరస్థుల అరెస్టుకు దారితీశింది. తేది: 14-10-2025 న పరకాల ఎసిపి సతీష్ బాబు, శాయంపేట సి.ఐ. పి. రంజిత్ రావు కలసి కాట్రపల్లి గ్రామానికి చెందిన వాంకుడోత్ చరణ్ మరియు ఐకెపి సెంటర్ ఇంచార్జ్ అల్లే అనితను అరెస్ట్ చేశారు. చరణ్ వద్ద 20వేల నగదు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుంటూ, అనిత వద్ద ఐకెపి సెంటర్‌కు చెందిన ట్యాబ్, టోకెన్ షీట్ బుక్ మరియు సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ కోసం నేరస్థులను సంబంధిత అధికారులు తరలించారు. పోలీసులు తనదైన దర్యాప్తును కొనసాగిస్తున్నారు.





# సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

హనుమకొండ, అక్షర దర్బార్: కాజీపేటలోని పీజీఆర్ గార్డెన్స్ లో బుధవారం జరుగనున్ననర్సంపేట శాసనస భ్యుడు దొంతు మాధవరెడ్డి మాతృమూర్తి దశ దిన ఖర్మ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులతో కలసి పీజీఆర్ గార్డెన్స్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి సీఎం భద్రతపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు ఉండకూడదని సూచించారు.



# ప్రాణాలతో చెలగాటం

## పరిమితికి మించి ట్రాలీల్లో కూలీల తరలింపు

## మితిమీరిన వేగం, కూలీల భద్రతకు ప్రమాదం"

## చర్యలు తీసుకోవాలని మండల ప్రజల డిమాండ్

అక్షర దర్బార్, శాయంపేట: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు బతుకు దెరువ కోసం ప్రైవేట్ ట్రాలీలను ఉపయోగిస్తున్నాయి. అయితే, వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి, మితిమీరిన వేగంతో ట్రాలీలను నడుపుతున్నారు. ఇలాంటి మితిమీరిన ప్రయాణం కారణంగా గతంలో ప్రాణాల నష్టం కూడా జరిగింది. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఉద్దేశంతో, ట్రాలీలలో సరైన పత్రాలు లేకుండా, డ్రైవర్‌లకు లైసెన్స్ లేకుండా నడిపించడం రహదారుల భద్రతకు ప్రమాదం కలిగిస్తోంది. ప్రజలు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, నిబంధనలకు విరుద్ధంగా వాహనాల రాకపోకలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించాలి

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



అక్షర దర్బార్, పరకాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం నడికూడ మండలం రాయపర్తి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలతో పాటు రెండు అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాలల్లో అమలవుతున్న లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రామ్ (LIP), విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించి, ఉపాధ్యాయులతో వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం వంట గదులను పరిశీలించి, అందులో పాటిస్తున్న మెనూ, పరిశుభ్రత అంశాలను సమీక్షించారు. అంగన్వాడీ కేంద్రాలలో కూడా కలెక్టర్ స్నేహ శబరీష్ వంట గదులు, పిల్లల ఆహార నాణ్యత, హాజరు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వాసంతి, తహసీల్దార్ రాణి, మండల విద్యాశాఖ అధికారి హనుమంతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల స్వామి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# గంగారం జీపీలో డీపీవో తనిఖీ



అక్షర దర్బార్, కాటారం: కాటారం మండలంలోని గంగారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత తనఖీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ లోని పలు రికార్డులను పరిశీలించారు.అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు.పల్లె ప్రగతి పనులతో పాటు, కంపోస్ట్ ఎరువు తయారీని పరిశీలించారు.గ్రామంలో పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టేలా ప్రత్యేక చొరవ చూపాలని పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కర్ణాకర్ ను ఆదేశించారు.

# గోనె రాజయ్యకు బీఆర్ఎస్ నేతల నివాళి

## అంతిమయాత్రలో పాల్గొన్న డాక్టర్ బానోతు సారంగపాణి



అక్షర దర్బార్, నల్లబెల్లి:నల్లబెల్లి మండలం కొండ ఐలోని పల్లిలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ నాయకులు గోనె సంజీవ్ రెడ్డి, గోనె వీరస్వామి తండ్రి గోనె రాజయ్య గారు నిన్న రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు.మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, అంతిమ యాత్రలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బానోతు సారంగపాణి, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలెపు రాజేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ ఇంగ్లీ శివాజీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొలగని రామారావు, తెలంగాణ విజయ్ తదితరులు పాల్గొన్నారు.అదనంగా మాజీ సర్పంచులు మామిళ్ల మోహన్ రెడ్డి, గోనె రాంబాబు, టాక్స్ డైరెక్టర్ కొనకంటి వీరమల్లు, కొనకంటి లింగారెడ్డి, ఊరటి నరేష్, మామిళ్ల గోపి, రాధారపు నరేష్, ఎద్దు రవి, ఊరటి వీరస్వామి, ఎడాకుల కుమారస్వామి, మేడిద చంద్రరెడ్డి గార్లతో పాటు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, గ్రామ ప్రజలు కూడా అంతిమయాత్రలో పాల్గొన్నారు.



# మహా రుద్రయాగ స్థల పరిశీలన

అక్షర దర్బార్, పరకాల : కార్తీక మాస మహా రుద్రయాగ మహోత్సవం నవంబర్ 3న జరగనుంది. ఈ సందర్భంగా పరకాలలో యాగశాల, యాగకుండాల నిర్మాణాన్ని ఆగమశాస్త్ర నియమాల ప్రకారం ప్రముఖ పండితులు బ్రహ్మశ్రీ కోమళ్ళపల్లి సంపత్ కుమార్ శర్మ పరిశీలించారు. మహా రుద్రయాగ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# మాధవరెడ్డి ఛాలెంజ్ కి బీసీలు స్పందించాలి

## బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి

అక్షర దర్బార్, నల్లబెల్లి: రెడ్డి జాగృతి నాయకుడు బుట్టెం మాధవరెడ్డి బీసీలను అవహేళన చేస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఆయన చేసిన ఛాలెంజ్‌ను బీసీ సమాజం స్వీకరించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, “రెడ్ల సహాయం లేకుండా బీసీలు బతకలేరని చెప్పడం అగ్రకుల అహంకారానికి నిదర్శనం. బీసీలతోనే రెడ్లు వ్యాపారాలు నడుపుతున్నారు. బీసీల చెమట చుక్కల మీదే వారి సంపదలు నిలుస్తున్నాయి” అని విమర్శించారు. 60 శాతం మంది ఉన్న బీసీల లేకుండా సమాజం మనుగడే లేదని, అగ్రకులాల ఆధిపత్యం కారణంగా బహుజనులు తరతరాలుగా శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆయన అన్నారు. ఇకనుంచి బీసీలు రాజకీయ, ఆర్థిక రంగాల్లో ఏకం కావాలని పిలుపునిచ్చారు. “బీసీల ఓట్లు, పన్నుల మీద కూర్చొని అగ్రకులాలు బీసీల వాటాను నిరాకరిస్తున్నాయి. ఇక మౌనం వద్దు .. బీసీలు సమాన హక్కుల కోసం ఐక్యంగా నిలబడాలి” అని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీసీ సాధన సమితి మండల కన్వీనర్ కడియాల క్రాంతికుమార్, నాయకులు కోల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.





# చిరుధాన్యాలతోనే ఆరోగ్యం పదిలం

అక్షర దర్బార్, చిట్యాల : చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పదిలమవుతుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద అన్నారు. పోషణ మాసం సందర్భంగా తండా గ్రామంలో అంగన్వాడి టీచర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని సేంద్రియ పద్ధతుల ప్రాముఖ్యత, వ్యక్తిగత శుభ్రత, ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాశనం నిర్వహించారు. పోషకాహార స్టాల్స్ ను మహిళలు ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్ సింగ్ గారు, అంగన్వాడి టీచర్లు కస్తూరి, రజిత ప్రమీల, మమత, ఉమాదేవి, అనూష ,స్వప్న ,ఏఎన్ఎం లావణ్య, ఆశ వర్కర్స్ ఎక్కువ సంఖ్యలో మహిళలు హాజరయ్యారు.



# అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలి

అక్షర దర్బార్, చిట్యాల : బుద్ధుడు చూపిన మార్గం, అంబేద్కర్ ఆశయాలు అందరికీ ఆచరణీయమని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య అన్నారు. చిట్యాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బౌద్ధమతం స్వీకరణ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ గారు 1956లో నాగపూర్‌లో ఐదు లక్షల మందితో బౌద్ధమతం స్వీకరించారని, భౌద్ధమతమే మానవతా మార్గమని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గడ్డం సదానందం, కట్కూరి మొగిలి, చందర్ మొగిలి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




# సమస్యలు పరిష్కరించాలి

## ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల లో సంవత్సరాల తరబడి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీవీపీ నాయకులు మంగళవారం మండల కేంద్రంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజకుమార్ విభాగ కన్వీనర్ సుజిత్ లు మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ విద్యార్థుల కోసం హాస్టల్స్ వసతి ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన బస్టాండ్ ను ప్రారంభించాలని, బడి పక్కన బార్, బెల్ట్ షాపులను అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశాడు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి అజయ్, కళాశాల అధ్యక్షుడు కౌశిక్, శశి వర్ధన్, అభిరామ్, గణేశ్, హేమంత్, జయ ప్రకాష్, వినయ్, సూరజ్, సాయి చరణ్, నాని, కిరణ్, ప్రణయ్, మహేష్, శంకర్, అభినయ్, రామకృష్ణ ,వరుణ్, తేజ, అజయ్ పాల్గొన్నారు.

# పరకాలలో సంఘటన్ సృజన్ అభయాన్ సభ



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "సంఘటన్ సృజన్ అభయాన్" కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, పిసిసి కోఆర్డినేటర్ ఆదర్శ్ జైస్వాల్, ఇతర నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లా అధ్యక్షుల ఎంపిక పారదర్శకంగా, కార్యకర్తల అభిప్రాయం మేరకు జరుగుతుందని స్పష్టం చేశారు. బ్లాక్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు అభిప్రాయాలు సేకరించి ఏఐసీసీకి పంపుతామన్నారు. క్షేత్రస్థాయిలో కృషి చేసిన వారికి పదవు లు ఇచ్చే విధంగా చర్యలు ఉంటాయని హామీ ఇచ్చారు.

# రాష్ట్రస్థాయి సెమినార్ కు ఉపాధ్యాయురాలు



అక్షర దర్బార్, దుగ్గొండి : నాచినపల్లి ప్రభుత్వ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు వెలుదండి సుమలత రాష్ట్రస్థాయి విద్యా సెమినార్‌కు ఎంపికయ్యారు. ఆమె సమర్పించిన "ఇంపాక్ట్ ఆఫ్ కౌన్సిలింగ్ ఆన్ అకాడమిక్ పెర్ఫార్మెన్స్ అండ్ క్యారీర్ ఛాయిసెస్ ఆఫ్ స్టూడెంట్స్" పత్రం ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 15న హైదరాబాదులో జరిగే ఎస్‌సీఆర్‌టిలో పేపర్ ప్రజెంటేషన్ చేయనున్నారు.



# జోరుగా ఇసుక దందా!

- కానరాని అధికారుల నిఘా
- కేసముద్రంలో యథేచ్ఛగా ఇసుక రవాణా
- లబోదిబోమంటున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు
- ట్రిప్ కు 7 నుంచి 8 వేలు వసూలు
- నెంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్ లలో రవాణా



అక్షర దర్బార్, కేసముద్రం: కేసముద్రం మండలంలో ఇసుక అక్రమ రవాణా ఊపందుకుంది. ఎలాంటి అనుమతులు లేకుండా, నెంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్లలో ఇసుకను బహిరంగంగా తరలిస్తుండగా, అధికారులు మాత్రం కనీసం కంటెత్తి చూడడం లేదు. ఈ దందాకు కొంతమంది అధికారులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ట్రాక్టర్ ఇసుక ట్రిప్‌కు ₹7 నుండి ₹8 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ మొత్తంలో కొంత శాతం అధికారుల జేబుల్లోకి వెళ్తోందని వినికిడి. ఉన్నతాధికారులు తనిఖీలకు రావచ్చనే సమాచారం ముందుగానే లీకవడంతో, అక్రమార్కులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తాజాగా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఉచిత ఇసుక అందించాలన్న నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఆ పథకం కాగితాలకే పరిమితమైందని లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఉచితంగా ఇవ్వాల్సిన ఇసుకను ట్రిప్పుకు వేల రూపాయలు తీసుకుంటూ దోపిడీ జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు లేకుండా ఇసుక ట్రాక్టర్లు రాత్రింబగళ్లు తిరుగుతుండటమే కాక, కేసముద్రం మండలంతో పాటు పొరుగున ఉన్న నెల్లికుదురు మండలం నుంచి కూడా అక్రమంగా ఇసుక తరలింపులు జరుగుతున్నాయి. "ఇసుకపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామంటూ మాట్లాడుతోంది కానీ, క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం దందా దారులే అయిపోయారు" అని మేధావులు విమర్శిస్తున్నారు. సామాన్య ప్రజలకు ఇసుక అందక, ఇండ్ల నిర్మాణం ఆగిపోతున్న పరిస్థితి నెలకొంది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు "మాకు ఇసుక కావాలంటే డబ్బులు చెల్లించాలా? ప్రభుత్వం చెప్పింది ఉచితమని.. అయితే ఈ దందా ఎందుకు?" అని ప్రశ్నిస్తున్నారు. ప్రజలు అధికారులు నిద్రలేచి ఆర్టీవో, రెవెన్యూ, పోలీసు విభాగాలు సమన్వయంగా నిఘా ఏర్పాటు చేసి, అనుమతులు లేని ట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. "ఇసుక బకాసురులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?" అనే ప్రశ్నకు సమాధానం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# పార్టీ కోసం కృషి చేసిన వారికే పదవులు..

## వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



అక్షర దర్బార్, పరకాల: పరకాలలో జరిగిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డా. కడియం కావ్య మాట్లాడుతూ, అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, పార్టీ అధ్యక్ష ఎన్నికలు పారదర్శకంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. పార్టీ కోసం కృషి చేసిన వారికినే పదవులు కల్పిస్తామని, యువత, మహిళలు, గిరిజనులు, అణగారిన వర్గాలకు కాంగ్రెస్ బలంగా నిలుస్తుందని తెలిపారు.

# అధైర్య పడొద్దు... అండగా ఉంటాం



అక్షర దర్బార్, నూగూరు–వెంకటాపురం: వీరభద్రవరం గ్రామానికి చెందిన నిరుపేద ఎస్టీ కుటుంబానికి అండగా నిలిచిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు. ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పూనెం రామ్మూర్తి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ములుగు జిల్లా ఉపాధ్యక్షులు మంచెర్ల నాగేశ్వర రావు, వెంకటాపురం మండల కార్యదర్శి బట్ట నాగేందర్ ఆధ్వర్యంలో రూ. 4వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. యూత్ సభ్యులు సోలం సుధాకర్, పోడెం సురేష్, మాటూరి వెంకటేష్, బంద రాము, బట్ట నారాయణ, దర్రాజు దామోదర్, చీడెం పుల్లయ్య, బట్ట శేఖర్, సొలం చంటి, పూణెం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# జీరో బ్యాలెన్స్ అకౌంట్ల పేరుతో మోసం

- వినియోగదారుల కేంద్రాలపై చర్యలు చేపట్టాలి
- బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజులు నిరంజన్

అక్షర దర్బార్, పరకాల: జీరో బ్యాలెన్స్ ఖాతాల పేరుతో విద్యార్థుల నుంచి వసూళ్లు జరుగుతున్నాయంటూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజులు నిరంజన్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. పరకాల ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ, "విద్యార్థులకు అవసరమైన జీరో బ్యాలెన్స్ అకౌంట్లను తెరవడంలో కొన్ని వినియోగదారుల కేంద్రాలు అక్రమంగా రూ.500 వసూలు చేస్తున్నాయి" అని ఆరోపించారు. రోజు సుమారు 200 నుండి 500 వరకు ఖాతాలు తెరవబడుతున్నాయని, ప్రతి ఖాతాపై రూ.500 వసూలు చేయడం వెనుక బ్యాంకు అధికారుల ప్రమేయం ఉందా అన్న అనుమానం వ్యక్తమవుతోందన్నారు. పరకాల పట్టణంలోని ఎస్‌బీఐ వినియోగదారుల కేంద్రాలపై తక్షణమే తనిఖీలు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి సంగా పురుషోత్తం, ఉపాధ్యక్షుడు మిడిదొడ్డి నరేష్, కార్యదర్శి దార్న సునీల్, సంగా నరేష్ పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మంగళవారం మొగుళ్లపల్లి ఎస్సై బొరగల అశోక్ పట్టుకున్నారు మొగుళ్లపెల్లి మండలం పోతుగల్లు వాగు నుండి  ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారనే పక్క సమాచారంతో మొగుళ్ళపల్లి ఎస్సై మాటు వేసి నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశారు.

# నివాళులర్పించిన సోదా..

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరీ విజయపాల్ రెడ్డి తల్లి రంగమ్మ మృతి చెందగా, మంగళవారం 5వ రోజు కార్యక్రమానికి పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సోదా రామకృష్ణ , సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ నల్లెల్ల అనిల్ కుమార్, ఏకు రాజు, దామెర మొగిలి, పీఏసీఎస్ పరకాల వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొచ్చు జెమిని హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.






# సుప్రీం కోర్టులో ఎస్ఎల్పీ

- 'బీసీ కోటా'పై స్టే నిలువరించాలని రాష్ట్ర ప్రభుత్వం దాఖలు
- హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ అత్యున్నత న్యాయస్థానానికి..
- ఎల్లుండి లేదా ఆ తర్వాతి రోజు విచారణకు వచ్చే అవకాశం



న్యూఢిల్లీ, అక్షర దర్బార్: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవో– 9పై హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను మంగళవారం కోర్టు రిజిస్ట్రార్ దగ్గర ప్రభుత్వ న్యాయవాదులు మెన్షన్ చేశారు. గురువారం లేదా శుక్రవారం విచారించాలని విజ్ఞప్తి చేశారు. సీజేఐ అనుమతితో లిస్ట్ చేయనున్నట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు. రిజర్వేషన్లపై 50% పరిమితి విధిస్తున్నట్లు రాజ్యాంగంలో ఎక్కడా నిబంధనలు లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోపై స్టే విధించడాన్ని తప్పుబడుతూ రాష్ట్ర సర్కారు ఈ పిటిషన్ దాఖలు చేసింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో 50శాతానికి అంతకుమించి రిజర్వేషన్లు కల్పించవచ్చని ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు చెప్పింది అని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాదులు వాదించనున్నారు. రిజర్వేషన్ల అమలు కోసం ట్రిపుల్ టెస్ట్ నిర్వహించాలని వికాస్ కిషన్‌రావ్ గవ్లీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో పేర్కొంది. తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఆ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం పాటించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంతమేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం నిర్వహించింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే 2024–25లో రాష్ట్ర జనాభాలో 56.33% మంది బీసీలు ఉన్నట్లు తేలింది. 42% రిజర్వేషన్ల కల్పనకు అదే ప్రాతిపదిక. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342–ఎ(3) కింద దఖలు పడిన అధికారాలను అనుసరించి ప్రభుత్వం ఈ కసరత్తు చేసింది. ఇలాంటి కసరత్తును రాహుల్ రమేశ్ వాఘ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు సమర్థించింది అని కోర్టుకు విన్నవించనున్నారు.

### న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం: పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్ఎల్పీ గురువారం నాడు విచారణకు వస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు అన్ని పార్టీలు మద్దతిచ్చాయని, ఇప్పుడు మాట మారుస్తున్నాయని అన్నారు.

# ఇన్ఫార్మర్ నెపంతో బీజేపీ నేత హత్య

- మావోయిస్టుల దుశ్చర్య
- బీజాపూర్ జిల్లాలో దారుణం
- మృతదేహం వద్ద మావోయిస్టు పార్టీ లేఖ



అక్షర దర్బార్, చర్ల : భద్రాద్రి జిల్లా చర్ల సరిహద్దు రాష్ట్రమైన  ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బస్తర్‌లో మంగళవారం మావోయిస్టులు దారుణానికి పాల్పడ్డారు. ఓ బీజేపీ నాయకుడిని దారుణంగా హత్యచేశారు. ఇన్ఫార్మర్ అని ఆరోపిస్తూ మావోయిస్టులు ఇల్మిండి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముజల్కంకేర్ గ్రామానికి. చెందిన పూనం సత్యం ను హత్య చేశారు. వారి మునుపటి వ్యూహాలను పునరావృతం చేస్తూ  మృతదేహం వద్ద ఒక కరపత్రాన్ని వదిలి వెళ్ళారు, దానిలో అనేక తీవ్రమైన ఆరోపణలు చేశారు. మావోయిస్టు మద్దేడ్  ఏరియా కమిటీ ఈ హత్యకు బాధ్యత వహించింది. మృతదేహం దగ్గర కనిపించిన లేఖలో బ్రాహ్మణ హిందూత్వ ఆధారిత బీజేపీ, ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీ, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి ప్రభుత్వం మార్చి 2026 నాటికి మావోయిస్టు పార్టీని నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ లక్ష్యం దిశగా, బీజేపీ ప్రతి గ్రామంలో తన సంస్థను బలోపేతం చేస్తోంది , సమాచారం ఆధారంగా మా పార్టీలపై దాడి చేయడానికి పోలీసు ఇన్‌ఫార్మర్లను సేకరిస్తోంది అని లేఖలో రాసి ఉంది.

# మావోయిస్టు డంప్ స్వాధీనం

- ఐదు ఐడీ బాంబులు నిర్వీర్యం
- మావోయిస్టు పార్టీకు భారీ షాక్
- భద్రతా దళాలను హతమార్చే వ్యూహం భగ్నం

చర్ల, అక్షర దర్బార్: భద్రాద్రి జిల్లా చర్ల మండల సరిహద్దు రాష్ట్రమైన చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసురు పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడ్వాల గ్రామంలో భద్రతా దళాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. మావోయిస్టుల ప్రధాన కుట్రను భగ్నం చేస్తూ.. పార్టీ దాచిపెట్టిన భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ విషయం మంగళవారం వెలుగు చూసింది. కోబ్రా 206, సిఆర్పిఎఫ్  229, 153 , 196ల సంయుక్త బృందం తడ్వాలా బేస్ క్యాంప్ నుంచి కేజీహెచ్ ఫుట్‌హిల్స్ ప్రాంతంలో ఒక శోధన ఆపరేషన్ నిర్వహించింది. 51 లైవ్ బీజీఎల్ ముక్కలు 100 కట్టల హెచ్చీ అల్యూమినియం వైర్ 50 స్టీల్ పైపు ముక్కలు (బీజీఎల్ తయారీ కోసం)  పెద్ద మొత్తంలో విద్యుత్ వైర్  20 ఇనుప షీట్ ముక్కలు (బీజీఎల్ తయారీ కోసం) 40 ఇనుప ప్లేట్ ముక్కల (బీజీఎల్ తయారీ కోసం)తో పాటు భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని అమర్చిన ఐదు ప్రెషర్ ఐఈడీలను జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. భద్రతా దళాల అప్రమత్తత, ప్రభావవంతమైన చర్య కారణంగా మావోయిస్టుల ప్రణాళికలు విఫలమయ్యాయి.




# ప్రస్తుత డీసీసీలకు రెండోసారి నో ఛాన్స్

- పార్టీలో గ్యాప్ లేకుండా ఐదేళ్లు పనిచేస్తున్న వారే అర్హులు
- బంధువులు, సన్నిహితుల కోసం పైరవీలు వద్దు..
- ఏఐసీసీ పరిశీలకులతో వ్యక్తిగత సంభాషణ వద్దు..
- కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్



అక్షర దర్బార్, హైదరబాద్ : ప్రస్తుతం జిల్లాస్థాయిలో డీసీసీలుగా పని చేస్తున్న వారికి ఎట్టి పరిస్థితుల్లో రెండోసారి అవకాశం లేదని కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. డీసీసీల ఎంపిక కోసం కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం వారు అన్ని జిల్లాల పార్టీ నేతలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ ఆర్గనైజేషన్ ఇన్చార్జి కేసీ వేణుగోపాల్ ఆదేశాలను కేడర్ శిరసా వహించాలని సూచించారు. డీసీసీ అధ్యక్ష పదవులకు దరఖాస్తు చేసుకునే వారు కనీసం ఐదేండ్ల పాటు నిరంతరంగా పార్టీలో క్రమశిక్షణతో పనిచేసి ఉండాలని తెలిపారు.  అలా లేని వారిని ఏఐసీసీ పరిశీల కులే తొలగిస్తారని తేల్చిచెప్పారు. పార్టీకి సంబంధించిన ప్రజాప్రతినిధుల దగ్గర బంధువులకు సైతం అవకాశాలు లేవని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళ నాయకులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. డీసీసీల ఎంపిక కోసం అధిష్టానం పంపించిన ఏఐసీసీ పరిశీలకులతో ఏ నాయకులు వ్యక్తిగత సంభాషణలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. జిల్లాలోని సమావే శాలు అక్కడి నాయకుల ఇళ్లల్లో, వారి సొంత కార్యాలయాల్లో పెట్టరాదని కేవలం పార్టీ కార్యాలయం లేదా అందరికీ అందుబాటులో ఉండే ప్రాంతంలోనే సమావేశాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా ఏఐసీసీ ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన ఓట్ చోరీ కార్యక్రమంలో గ్రామంలో కనీసం వంద మంది సంతకాలు చేయించి పంపించాలని సూచించారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్
విప్లవంలో
భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం
QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా
వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915